
ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు 5

గురువారం 4 డిసెంబరు 2025

నేడు డీడీవో కార్యాలయం ప్రారంభం

- చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని గురువారం ప్రారంభిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీఓ కార్యాలయాలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఆవరణలో పాత జడ్పీ భవనాన్ని ఇటీవల సుమారు రూ.15 లక్షలతో మరమ్మతు చేశారు. కొత్త హంగులు, అత్యాధునిక సాంకేతికతతో కార్యాలయాన్ని రూపొందించారు. డీడీవో కార్యాలయంలో ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటుచేసి ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. పంచాయతీరాజ్ సంస్కరణలో భాగంగా ఈ కార్యాలయ ఏర్పాటుకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. డీడీవో పోస్టులను గ్రామీణాభివృద్ధిలో అత్యంత కీలకంగా శాఖ భావిస్తోంది. డివిజన్ స్థాయిలో ఈ కార్యాలయాలు మినీ కలెక్టరేట్‌గా ప్రజలకు సేవలు అందించనున్నాయి. డివిజన్ స్థాయిలోని డివిజన్ పంచాయతీ కార్యాలయం, డ్వామా ఏపీడీ కార్యాలయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన డివిజన్‌కు సంబంధించిన కార్యాలయాలన్నింటినీ ఒకే చోట ఏర్పాటు చేస్తున్నారు. డ్వామా ఏపీడీలు, డివిజనల్ పంచాయతీ అధికారులు డీడీఓ కార్యాలయాల్లో విధులు నిర్వహించాలి.

వంతెన నిర్మాణం ఎందుకు ఆగింది?

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



వంతెన నిర్మాణంపై ఆరా తీస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

హాలహర్వి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతకుంట జాతీయ రహదారి వంతెన నిర్మాణం ఎందుకు ఆగిందంటూ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆరాతీశారు. బుధవారం హాలహర్వి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వంతెన నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోతే ప్రమాదాలు జరుగుతాయి కదా అంటూ ఎస్‌ఐ మారుతిని అడిగారు. వెంటనే వంతెన వివరాలిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. హాలహర్వి మండలం ప్రశాంతంగా ఉందని, గొడవలు, అల్లర్లు, నేరాలు వంటివి తక్కువగా ఉన్నాయన్నారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవి శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ మారుతి ఉన్నారు.

మెగా పేరెంట్స్ మీట్‌కు బడ్జెట్

- 1,482 పాఠశాలలకు రూ. 54,61,650



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ఈ నెల 5వ తేదీన ప్రభుత్వ, అన్ని ఎయిడెడ్ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించే మెగా పేరెంట్స్ మీట్ కోసం జిల్లాలోని 1,482 పాఠశాలలకు రూ.54,61,650 బడ్జెట్‌ను విడుదల చేశారు. ఒక్కొక్క పాఠశాలకు విద్యార్థుల ఎన్‌రోల్‌మెంటు ప్రకారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్య పాఠశాలల్లో సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పీటీఎం-3 నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఏర్పాట్లన్నింటిలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర శిక్ష ఏపీసీ చర్యలు తీసుకుంటున్నారు. 0 నుంచి 30 విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.900, 31 నుంచి 100లోపు విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలకు రూ.2250లు, 101 నుంచి 250 మందిలోపు ఉన్న విద్యార్థుల పాఠశాలలకు రూ.4,500, 251 నుంచి వేయిలోపు సంఖ్య ఉన్న పాఠశాలలకు రూ.6,750, వేయికి ఆపైన ఉన్న పాఠశాలలకు రూ.9 వేలు పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు ఖర్చు చేసేందుకు నిధులు కేటాయించారు. గత ఏడాది పేరెంట్స్ మీట్ స్ఫూర్తితో ఈ నెల 5వ తేదీన పీటీఎం-3కు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల చేత ముఖ్య అతిథులకు ఆహ్వాన పత్రికలు పంపిణీ, పాఠశాలల సుందరీకరణ తదితర పనులు చేయిస్తున్నారు. పీటీఎం విజయవంతం చేసేందుకు సమగ్రశిక్ష ఏపీసీ చర్యలు తీసుకుంటున్నారు.

జ్యోతిర్ముడి శివస్వాములకు మాత్రమే స్పర్శ దర్శనం


- రెండు గంటలకు ఒకసారి ప్రత్యేక స్లాటు



మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్ముడి కలిగి ఉన్న శివస్వాములకు మాత్రమే శుక్రవారం వరకు ప్రతిరోజు రెండు గంటలకు ఒకసారి ఉచిత స్పర్శ దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన చైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసాంతం మండల దీక్షలు పూర్తి చేసుకుని మాల విరమణ చేసేందుకు శివస్వాములు వేలాదిగా శ్రీశైలానికి తరలి వస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో ముందుగానే గర్భాలయ, సామూహిక అభిషేకాలు నమోదు చేసుకున్న సేవాకర్తలకు మాత్రం నిర్ణీత టైంస్లాట్ ప్రకారం దర్శనాలు కల్పించనున్నామని అన్నారు. వీవీఐపీ సిఫార్సు లేఖలు, ఆన్‌లైన్ వీఐపీ బ్రేక్ దర్శనాలు ఈనెల 8వ తేదీ వరకు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అధిక సంఖ్యలో వస్తున్న యాత్రికులందరికీ దర్శనభాగ్యం కల్పించాల్సినందున అలంకార దర్శనం మాత్రమే అందుబాటులో ఉంచారన్నారు.

జీడీపీకి రూ.92 కోట్లు



గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచడానికి చేపట్టిన పనులు రెండేళ్లకు పైగా ఎక్కడికక్కడ ఆగిపోయాయి. 4.50 టీఎంసీల నుంచి 5.50 టీఎంసీలు నిల్వ సామర్థ్యం పెంచడానికి వీలుగా మట్టి ఆనకట్ట ఒక మీటరు ఎత్తు పెంచడానికి గత వైసీపీ హయాంలో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టరుకు రూ.27 కోట్లకు పైగా బిల్లులు బకాయి పెట్టారు. ఆ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. అయితే.. వరదల వల్ల ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉండడంతో కాంట్రాక్టరుపై ఒత్తిడి తెచ్చి రెండు గేట్లు ఏర్పాటు చేయించారు. అయితే ముంపునకు గురయ్యే భూములకు నష్టపరిహారం ఎంత ఇచ్చేదీ ఈ రోజుకూ తేల్చి చెప్పలేదు. రాబోయే జూలై ఆఖరులోగా పనులు పూర్తి చేయాలంటే రూ.92 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- అసంపూర్తి పనులకు అధికారుల ప్రతిపాదన
- 5.50 టీఎంసీలు నిల్వ చేసేందుకు వీలుగా..
- వైసీపీ హయాంలో మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే పనులకు శ్రీకారం
- బిల్లులు ఇవ్వలేదని చేతులెత్తేసిన కాంట్రాక్టరు
- రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాల పునర్విభజన తరువాత కర్నూలు జిల్లాలో మిగిలిన ఏకైక సాగునీటి ప్రాజెక్టు గాజులదిన్నె జలాశయం. దీని సామర్థ్యం కేవలం 4.50 టీఎంసీలు. కుడి, ఎడమ కాలువల ద్వారా గోనెగండ్ల, కోడుమూరు, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పరిధిలోని 21 గ్రామాలకు 25,454 ఎకరాలు రబీ ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉంది. డోన్, కృష్ణగిరి, బండగట్టు తాగునీటి పథకాలు ద్వారా డోన్ పట్టణం సహా వివిధ గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఎమ్మిగనూరు పట్టణానికి కూడా నీటి సరఫరా కోసం పైపులైన్ పనులు చేపట్టారు. వేసవిలో కర్నూలు నగరం దాహం తీర్చే జీవనాడి. కరువు నేలకు సాగునీరు అందించి రైతుల కన్నీళ్లు తుడవాల్సిన ఈ ప్రాజెక్టు వివిధ పట్టణాలు, గ్రామాలకు తాగునీరు అందించే ఎస్‌ఎస్ ట్యాంక్‌గా మార్చారని రైతులు ఆరోపిస్తున్నారు. సాగు, తాగునీటి అవసరాలు దృష్ట్యా గత వైసీపీ ప్రభుత్వం సామర్థ్యం 4.50 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచుతూ రూ.135 కోట్లతో (భూసేకరణతో కలిపి) ఆనకట్ట ఎత్తు పెంచి, కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు చేపట్టింది. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా నిధులు ఇవ్వకపోవడం వల్ల రెండేళ్లుగా సామర్థ్యం పెంపు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

మిగతా 7లో...



జీడీపీ జలాశయం

నాణ్యమైన పత్తిని తీసుకురావాలి

- రైతులకు మద్దతు ధర అందించి ఆదుకుంటాం : కలెక్టర్ సిరి
- జిన్నింగ్ మిల్లుల తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

ఆదోని అగ్రికల్చర్/ ఆదోని, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 14 శాతం తేమ ఉన్న నాణ్యమైన పత్తిని రైతులు విక్రయానికి తీసుకురావాలని కలెక్టర్ ఏ.సిరి అన్నారు. బుధవారం కలెక్టర్ ఆదోనిలో సీసీఐ కొనుగోలు చేస్తున్న బత్తిని అభిరామ్ పత్తి జిన్నింగ్ పరిశ్రమ, చెన్న కేశవ పత్తి జిన్నింగ్ పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి రైతులకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర అందించి ఆదుకునేందుకే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వాహనాల్లో రైతులు తెచ్చిన పత్తిని పరిశీలించి వారితో మాట్లాడారు. నిబంధనలతో సీసీఐ తిరస్కరిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారు. స్లాట్ బుకింగ్ సమస్యను పరిష్కరిస్తామని రైతులు ఆందోళన చెందొద్దని సూచించారు. సీసీఐ నిర్వాహకులతో ఇప్పటివరకు కొనుగోలు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, ఏడీఎం నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు, తహసీల్దార్ రమేష్ ఉన్నారు.

ఐదుగురికి గ్రేడ్ -1 ఈవోలుగా పదోన్నతి

కర్నూలు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖలో కార్యనిర్వహణ అధికారులుగా కొనసాగుతున్న ఐదుగురికి గ్రేడ్ -1 ఈవోలుగా పదోన్నతి కల్పిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలోని దేవదాయ శాఖలో గ్రేడ్-2 కొనసాగిన హనుమంతరావు, కమలాకర్, చంద్రశేఖరరెడ్డి, మద్దిలేటి, పిఎస్ రాధాకృష్ణ గ్రేడ్-1 ఈవోలుగా పదోన్నతి పొందారు.

ఉపాధి పనుల్లో 'ఆమె'

- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పురుషుల కంటే మహిళలే అధికం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మహిళలకు వరంగా మారాయి. ప్రస్తుత ఏడాది 2025-26లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా పాల్గొన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఒక్కో మహిళ ప్రతి రోజూ కూలి పనుల ద్వారా సరాసరి రూ.250 నుంచి రూ.280 వరకు సం పాదిస్తుండటం విశేషం. కొంత మంది నెలలో 20 రోజులకు పైగా పనులకు వెళ్తున్నారు. భూముల లెవలింగ్, కాల్వల తవ్వకం, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, జల సంరక్షణ తదితర పనులు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 5,56,672 మంది కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాలుపంచుకుంటుండగా.. అందులో 35వేల మంది దాకా మహిళలు పని చేస్తున్నారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 4,60,098 మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో పాలుపంచుకుంటుండగా.. అందులో 25 వేల మంది దాకా మహిళలు పని చేస్తూ ఉపాధి హామీ పథకంలో తమ ప్రాధాన్యతను చాటుకుంటున్నారు.

- ఉపాధి హామీలో మహిళలే ఎక్కువ

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న 5 లక్షల మందికి పైగా కూలీల్లో సింహ భాగం మహిళలే ఉన్నారు. వీరంతా సక్రమంగా నెలలో 20 రోజులు పనులు చేస్తూ వచ్చిన వేతనంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటం గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారు చేయగలిగిన పనులనే ఉపాధి హామీ పథకానికి కేటాయిస్తున్నాయి.

\- వెంకట రమణయ్య, పీడీ





ఆదోని ఆర్‌అండ్ బీ గెస్ట్ హౌస్ వద్ద కలెక్టర్ డాక్టర్ సిరి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆదోని మండలంలోని ధణాపురంలో రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

ఆ మండలం మాకొద్దు

- కలెక్టర్ ఎదుట 16 గ్రామాల నిరసన
- ధణాపురంలో రెండు గంటల పాటు రాస్తారోకో
- ఆదోని జిల్లా కోసం కొనసాగుతున్న నిరసనలు

ఆదోని రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'ప్రాణాలైనా అర్పిస్తాం కానీ పెద్దహరివాణం మండలంలో మాత్రం మా గ్రామాలను కలిపితే చూస్తూ ఊరుకునేది లేదు..' అంటూ ఆదోని మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆదోని పర్యటనకు వచ్చిన కలెక్టర్ డాక్టర్ సిరి ఎదుట మండలంలోని పలు గ్రామాల ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట బైఠాయించి ఆదోని జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజాభిప్రాయం లేకుండానే తమ గ్రామాలను పెద్దహరివాణం మండలంలో ఏలా కలుపుతారని కలెక్టర్‌ను నిలదీశారు. ఒకప్పుడు పెద్దహరివాణం గ్రామస్థులు తమ గ్రామాన్ని కర్ణాటకలో కలపాలని డిమాండ్ చేశారని, ఆ గ్రామం మొత్తం కన్నడ మాట్లాడుతారని, కర్ణాటక రాష్ట్రానికి కూత వేటు దూరంలో ఉండే పెద్దహరివాణంలో తమ గ్రామాలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఆదోనికి దగ్గరగా ఉండే చాగి, ధణాపురం, నారాయణపురం, బసాపురం, గణేకల్, కడితోట, పాడేగల్లు తదితర గ్రామాలను 35 కిలోమీటర్ల దూరంలో ఉండే పెద్దహరివాణంలో కలపాలని ఎవరు సలహాలు ఇచ్చారంటూ కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్‌లను నిలదీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించామని తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి ప్రభుత్వానికి తెలియజేస్తామని కలెక్టర్ భరోసానిచ్చారు. ప్రజాభీష్టం మేరకే మండలాల ఏర్పాటు, గ్రామాల విలీనం ఉంటుందన్నారు. అయితే తమ గ్రామాల్లో ఎలాంటి సమావేశాలు జరగలేదని, తమను సంప్రదించకుండానే పెద్దహరివాణంలోకి తమ గ్రామాలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. తమ గ్రామాలను కొత్త మండలంలోకి చేర్చవద్దంటూ కలెక్టర్‌ను ప్రాధేయపడ్డారు. అనంతరం ధణాపురం రోడ్డుపై రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసనల్లో నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గణేకల్ విరుపాక్షి, చాగి మాల రాము, ధణాపురం ఈరన్న, మల్లి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదోని జిల్లా కోసం చేస్తున్న రిలే దీక్షలు బుధవారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. ఈ నిరసనలకు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఆదోని ఇన్‌చార్జి మల్లప్ప మద్దతు పలికారు.

ఉద్యోగినిపై టీడీపీ నేత దాడి

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కేజీబీవీ ప్రిన్సిపాల్



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి

హాలహర్వి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ బండారు మారుతీ తనను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడని హాలహర్వి కస్తూర్బా పాఠశాల(కేజీబీవీ) ప్రిన్సిపాల్ పద్మావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడికి పాల్పడిన బండారు మారుతిపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం విలేకరుల ఎదుట వెల్లడించారు. పాఠశాలకు వాచ్‌మన్ నియామకంలో తాము చెప్పిన వ్యక్తికే ఇవ్వాలంటూ టీడీపీ నేత బండారు మారుతీ తనపై ఒత్తిడి తెచ్చాడన్నారు. ఉన్నతాధికారులతో ఎలాంటి సంబంధం లేదని, తాము చెప్పినవారికే పోస్టింగ్ ఇవ్వాలంటూ వాగ్వాదానికి దిగాడన్నారు. బాలికలంతా చూస్తుండగా అందరినీ భయభ్రాంతులకు గురి చేశాడని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆమె బోరున విలపించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ విషయంపై హాలహర్వి ఎస్‌ఐ మారుతిని వివరణ కోరగా కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి తమకు ఫిర్యాదు చేశారని, వాస్తవాలపై విచారణ చేపడతామని తెలిపారు. ఇదిలా ఉండగా ప్రిన్సిపాల్ పద్మావతిని కలెక్టర్ డాక్టర్ సిరి ఫోన్‌లో సంప్రదించి భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనపై గురువారం నిరసనలు చేపట్టేందుకు పలువురు ఉద్యోగులు సిద్ధమయ్యారు.

స్క్రబ్ టైఫస్
తీవ్రమైన వ్యాధి కాదు

- తక్షణ చికిత్సతో నయమవుతుంది
- జిల్లాలో 50 కేసుల నమోదు
- డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్



కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆ వ్యాధిపై ప్రజల్లో అవగాన కల్పిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రమైనది కాదని, తక్షణ చికిత్సతో పూర్తిగా నయమవుతుందని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలోని స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైందని బుధవారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలతో కుటుంబ ఆరోగ్య శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రాష్ట్రంలో 2025లో 6778 అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించగా.. 1,346 కేసులు పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 508 రక్తనమూనాలను సేకరించగా.. 50 మందికి స్క్రబ్ టైఫస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు నివారణ చర్యలను ఆయన వివరించారు.

లక్షణాలు:

- అధిక జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు
- దద్దుర్లు, పురుగు కుట్టిన కాటు వద్ద నల్లరంగు పట్టు
- మూడు రోజులకు పైగా జ్వరం

నివారణ చర్యలు:

- వ్యవసాయ క్షేత్రంలో రక్షణ దుస్తులు ధరించాలి.
- దోమ తెరలు ఉపయోగించాలి
- పొలాల్లో పొదల్లో బయట నిద్రించకూడదు.
- మూడు రోజులకు పైగా జ్వరం ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

ఇలా చేయాలి:

- ఇల్లును పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎక్కడ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- పొడి పొలాల్లో చెప్పులు లేకుండా పని చేయరాదు.
- బయట నిద్రించే వారు దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలి.
- జ్వరం, దద్దుర్లు లేదా వల్ల మచ్చలు కనిపిస్తే వెంటనే చికిత్స పొందాలి.

ప్రాణాంతకం కాదు



స్క్రబ్ టైఫస్ వ్యాధి ప్రాణాంతకం కాదు. ఇది ఒరియాంటియా సత్సుగముషి బ్యాక్టీరియా ద్వారా స్క్రబ్ టైఫస్ సంక్రమిస్తుంది. కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చతో పాటు జ్వరం, తలనొప్పి, కండరాలు, నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయి. సాధారణంగా యాంటి బయాటిక్స్ మందులు ఇస్తే తగ్గిపోతుంది. ఈ వ్యాధికి డాక్సి సైక్లిస్ అజిత్రోమైసిన్ వంటి మందులు వాడితే నయం అవుతుంది. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీల్లో సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలిసా పరీక్షల ద్వారా స్క్రబ్ టైఫస్ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు.

- డాక్టర్ ఎల్. భాస్కర్, డీఎంహెచ్‌వో

జీడీపీకి రూ.92 కోట్లు ..!



నెర్రెలు ఇచ్చిన గట్టు

(5వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వ నిర్లక్ష్యం.. రైతులకు శాపం..

గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యం పెంపు పనుల్లో భాగంగా.. ప్రస్తుతం ఉన్న మట్టి ఆనకట్టకు సమాంతరంగా భూ మట్టం (గ్రౌండ్ లెవల్)లో 8-18 మీటర్లు, టాప్ లెవల్ 6 మీటర్ల వెడల్పు, 4.313 కిలో మీటర్ల పొడవు మట్టి ఆనకట్ట, రాక్‌టో, సీపేజ్ డ్రైనేజీ నిర్మాణం, పెంచిన ఒక మీటరు ఆనకట్టకు లోపలి వైపు రాతి పరుపు (స్టోన్ రివిట్మెంట్) వంటి పనులు రూ.35 కోట్లతో చేపట్టారు. అలాగే.. రూ.55 కోట్లతో ఆరు కొత్త గేట్లు అమర్చే పనులు చేపట్టారు. మట్టి పనులు, గేట్లు ఏర్పాటుకు రూ.90 కోట్లు, భూ సేకరణతో కలిపి రూ.135 కోట్లు గతంలో మంజూరు చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశారు. ఆరు కొత్త గేట్లు ఏర్పాటు కోసం 2023 సెప్టెంబరులో గేట్ల తయారీ (ఫ్యాబ్రికేషన్) పూర్తి చేశారు. డ్యాంలో నీరు దిగువకు వెళ్లకుండా స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చాల్సి (ఎరక్షన్) ఉంది. పాత గేట్ల ఇనుప తాళ్లు (రోప్స్) తొలగించి కిందకు దింపేశారే తప్ప కొత్త గేట్లు అమర్చలేదు. వరద వస్తే ఆనకట్టకు ముప్పు ఉంటుందని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఐ కబీర్‌బాషా ఇంజనీరుపై ఒత్తిడి తెచ్చి ఎట్టకేలకు ఐదు గేట్లు కొత్తవి ఏర్పాటు చేశారు. భూ సేకరణ చేయకపోవడం రైతులకు శాపంగా మారింది. భూ సేకరణ చేయకపోవడంతో ఆనకట్ట ఎత్తు పెంచినా అదనంగా టీఎంసీ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉంది.

ప్రభుత్వానికి ప్రతిపాదన

కూటమి ప్రభుత్వం వచ్చాక తక్షణమే అసంపూర్తి పనులు పూర్తి చేస్తారని రైతులు ఆశించారు. ఏడాదిన్నర గడిచినా ఆ దిశగా చేపట్టిన చర్యలు శూన్యం. రూ.57 కోట్లు విలువపై పనులు కాంట్రాక్టరు చేశారు. అందులో రూ.27 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. బకాయి బిల్లులు చెల్లింపులు, 627 ఎకరాల భూ సేకరణ, అసంపూర్తి పనులు పూర్తి చేయాలంటే రూ.92 కోట్లు నిధులు ఇవ్వాలంటూ టీబీపీ ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వర్షాలు, వరదలు లేకపోవడంతో పనులు చేసేందుకు అనుకూలమైన సమయం ఇది. ప్రభుత్వం నిధులు ఇస్తే తప్ప కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టే అవకాశం లేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గాజులదిన్నె ప్రాజెక్టు (సంజీవయ్య సాగర్)

ప్రాజెక్టు	: గాజులదిన్నె ప్రాజెక్టు
సామర్థ్యం	: 4.50 టీఎంసీలు
ఆయకట్టు	: 25,454
ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 377 మీటర్లు
ఆనకట్ట ఎత్తు పంపు పనులు పూర్తయితే..	
సామర్థ్యం	: 5.50 టీఎంసీలు
ఎఫ్ఆర్ఎల్ లెవల్	: 378 మీటర్లు
ఆయకట్ట పొడవు	: 4.313 కిలో మీటర్లు
మంజూరైన నిధులు	: రూ.135 కోట్లు (భూ సేకరణతో కలిపి)
ఇప్పటి వరకు చేసిన ఖర్చు	: రూ.57 కోట్లు
బిల్లు బకాయి	: రూ.27 కోట్లు
తాగునీటి ఆధారం	: డోన్, ఎమ్మిగనూరు, కోడుమూరు, కృష్ణగిరి పట్టణాలు సహా పలు గ్రామాలు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం



గాజులదిన్నె ప్రాజెక్టు 4.50 నుంచి 5.50 టీఎంసీల సామర్థ్యానికి పెంచేందుకు వీలుగా మట్టి ఆనకట్ట ఒక మీటరు ఎత్తు పెంచడం, పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లు ఏర్పాటు కోసం రూ.135 కోట్లతో పనులు మొదలు పెట్టారు. కాంట్రాక్టరు ఇప్పటి వరకు రూ.57 కోట్లు పనులు చేస్తే రూ.27 కోట్లు బిల్లులు బకాయి ఉన్న మాట నిజమే. భూ సేకరణ, అసంపూర్తి పనుల కోసం రూ.92 కోట్లు నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు మొదలు పెడతాం. వేదవతి ప్రాజెక్టు సహా గాజులదిన్నె ప్రాజెక్టు అసంపూర్తి పనులను ప్రాధా న్యతగా తీసుకొని పూర్తి చేయమని సీఎం చంద్రబాబు సంకల్పం

- పాండురంగయ్య, ఈఈ, టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలు పరిశీలించండి

• పార్లమెంట్‌లో ఎంపీ బస్తిపాటి నాగరాజు



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ

కర్నూలు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలను పరిశీలించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. బుధవారం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా జీవో అవర్‌లో ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ప్రకృతి విపత్తులు, జాతీయ అత్యవసర పరిస్థితులు, కొవిడ్ లాంటి క్లిష్ట సమయాల్లో దేశానికి నిబద్ధతతో సేవలు అందించారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించినా వారి సేవలకు గుర్తింపు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు తీవ్రమైన ఆర్థిక, వృత్తిపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 3వ పీఆర్సీ న్యాయమైన డిమాండ్లు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో పాటు రిటైర్మెంట్ పెన్షన్ల సవరణ ఇంకా పరిష్కారం కాలేదన్నారు. పీఆర్సీ అమలుకు అవసరమైన ఆర్థత మినహాయింపులు ఇవ్వాలని, పెన్షన్ల సవరణను లాభ నష్టాలపై ఆధారపకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లకు అనుగుణంగా పెన్షన్లను అమలు చేయాలని అన్నారు.

రేపు క్లస్టర్ వర్సిటీలో జాబ్ మేళా

కర్నూలు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 5న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ జీ. శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ఆధ్వర్యంలో ఎక్సెల్ ఎడ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ, ఇంటర్, పది చదివిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సర్టిఫికెట్లు జిరాక్స్‌లు, 3 ఫొటోలు, ఆధార్, బయోడేటాతో హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

వైసీపీ ఎంపీటీసీపై దాడి

• విచారణ చేస్తున్న తాలుకా పోలీసులు

నంద్యాల టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లె గ్రామంలో వైసీపీ నాయకుడు ఎంపీటీసీ హరినాథరెడ్డిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. హరినాథ్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం భీమవరం రోడ్డులో ఉన్న పొలానికి వెళ్లి పనులు ముగించుకుని వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆరుగురు కట్టెలతో, మరణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో బాధితుడికి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

మేం చచ్చాక కాలనీకి వస్తారా...?

• వైద్యులపై వాల్మీకి నగర్ వాసుల ఆగ్రహం
• కాలనీలో రెండు డెంగీ కేసులు నమోదు



బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'మేము చచ్చాక కాలనీకి వస్తారా.. అసలు మా కాలనీని ఎందుకు పట్టించుకోవడం లేదని వైద్యులు, పంచాయతీ అధికారులపై కోసిగి 3వ వార్డు వాల్మీకినగర్ కాలనీవాసులు ఆగ్రహించారు. బుధవారం వాల్మీకినగర్‌లో బుగేని శ్రీనివాసులు, మహాదేవి, దంపతుల కుమార్తె శ్రీవిద్య (8 నెలలు) డెంగీ బారిన పడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. అదే కాలనీకి చెందిన మరో బాలుడు దేవాన్ష్ (16 నెలలు) డెంగీతో ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే కాలనీకి మొదటిసారి వచ్చిన వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై కాలనీ వాసులు ఆగ్రహంతో ఊగిపోయారు. ఊరి చివర సబ్ సెంటర్‌లో ఉండే వైద్యసిబ్బంది కూడా తమ కాలనీ వైపు రాలేదని మండి పడ్డారు. వారానికి ఒకసారి కూడా వైద్యసిబ్బంది కాలనీవైపు చూడడం లేదని కాలనీకి చెందిన మహిళలు గంగమ్మ, గుడిసె లక్ష్మి, నేసే లక్ష్మి, ఈరమ్మ, కోసిగమ్మ తదితరులు మండిపడ్డారు. అలాగే డ్రైనేజీ కాలువలు క్లీన్ చేయడం లేదని, దోమలు ఉన్నా ఫాగింగ్ చేయడం లేదని, నెలకొకసారి డ్రైనేజీలు శుభ్రపరిచినా కాలువలు తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మంజునాథ్, డా.రాజ్‌కిరీటి, వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, రాముడు, సుజాత, మల్లికార్జున, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసీ నాగప్ప వీధికి చెందిన ప్రసాద్‌రావు (36) బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రసాద్‌రావు ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. గత కొద్ది కాలంగా ఆ మహిళతో విభేదాలు వచ్చాయి. రెండు రోజుల క్రితం ఆ మహిళ, కొడుకు మాటలకు ప్రసాద్‌రావు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆ ఇద్దరిపై ప్రసాద్‌రావుపై చేయి చేసుకున్నాడు. ఆ తర్వాత ఆయన తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంటనే గుర్తించిన తల్లి స్థానికుల సాయంతో ఆసుపత్రికి తరలించింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్గీత కంఠస్థంలో స్వర్ణగౌరి సత్తా



స్వామీజీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్న స్వర్ణగౌరి దంపతులు

కొలిమిగుండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో అవదూత దత్తపీఠం వేదికగా జరిగిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో కొలిమిగుండ్లకు చెందిన స్వర్ణగౌరి ప్రతిభ కనబరచి స్వర్ణ పతకం సాధించారు. ఈమేరకు ప్రముఖ పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థం పేరుతో ఈపోటీలు నిర్వహించగా వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నారు. స్వర్ణగౌరి భగవద్గీతలోని 700 శ్లోకాలను ఉచ్చారణ, అక్షర దోషం లేకుండా చెప్పారు. స్వర్ణగౌరి, సూర్యనారాయణరెడ్డి దంపతుల ప్రతిభను పలువురు అభినందించారు.

వ్యవసాయ సహకార సంఘాల సమరభేరి..

• 6 నుంచి సమస్యల సాధనకు ఆందోళన కార్యక్రమాలు



కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డితో ఉద్యోగులు

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు తమ సమస్యల సాధన కోసం ఐక్య వేదికగా ఏర్పాటై ఈ నెల 6వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎన్నోసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించమని విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేయాలని నిర్ణయించామని వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షుడు హనీఫ్ బాషా తెలిపారు. ఇందులో భాగంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బుధవారం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ డి. విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ నెల 6వ తేదీ నుంచి వివిధ దశల్లో జనవరి 5వ తేదీ వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల కార్యాచరణ ప్రణాళికను విలేకరులకు యూనియన్ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు హరినాథరెడ్డి, సతీష్, పుల్లయ్య, కోటేశ్వరరెడ్డి, మాలిక్ బాషా, ప్రదీప్ కుమార్, సత్యనారాయణ, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

జోరుగా మాస్ కాపీయింగ్

• ఎంపీహెచ్‌డబ్ల్యూ పరీక్షల్లో ఇష్టారాజ్యం

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఫీమేల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ఫీమేల్) పరీక్షల్లో జోరుగా మాస్ కాపీయింగ్ సాగుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి కర్నూలు, అనంతపురం కళాశాలలకు చెందిన విద్యార్థులు కర్నూలులోని ఫీమేల్ శిక్షణ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు. అయితే.. కొందరు ఇన్విజిలేటర్లు ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలతో కుమ్మక్కై మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు కాలేజీల యాజాన్యాలు విద్యార్థుల డబ్బులు వసూలు చేసి డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందికి ముట్టచెప్పినట్లు విమర్శల వస్తున్నాయి. పరీక్షకు చీఫ్ ఎగ్జామినర్‌గా డీఐవో వ్యవహరిస్తున్నారు. పరీక్షా కేంద్రం (ప్రాంతీయ శిక్షణా కేంద్రం ఫీమేల్) ఆవరణలో మైక్రో జిరాక్స్ కాపీలు కనిపిస్తున్నాయి.



పరీక్షా కేంద్రం బయట స్లిప్పులు

● ఈ విషయమై డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్‌ను వివరణ కోరగా.. మాస్ కాపీయింగ్ వ్యవహారం నా దృష్టికి రాలేదని, రేపటి నుంచి తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల స్థలాలు, లబ్ధిదారుల జాబితాపై విచారణ

• సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

కర్నూలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం' అమలు చేసింది. పేదలకు ఇంటి పట్టాలు, పక్కా ఇల్లు నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చారు. పలు గ్రామాల్లో భూసేకరణలో, పక్కా ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాలు, లబ్ధిదారులు, అర్హులు, అనర్హులు ఎందరు ఉన్నారో లెక్క తేల్చి నివేదిక ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఇందులో భాగంగానే నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్ సిరి.. ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు పత్తికొండ ఆర్డీవోలు, కర్నూలు కార్పొరేషన్ కమిషనర్, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. 2019-20 నుంచి 2024-25 వరకు నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల స్థలాల సమాచారాన్ని పక్కాగా చేర్చాలని అందులో పేర్కొన్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) ఆదేశాల మేరకు వివరాలు సేకరించాలని ఆదేశిస్తే కర్నూలు హౌసింగ్ పీడీ, ఏపీ టిడ్కో కర్నూలు ఎస్ఈ మినహా ఇతర అధికారులు సంబంధిత సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. తక్షణమే వివరాలు సేకరించాలని ఆదేశించారు. అలాగే పేదలకు ఇళ్ల పంపిణీ కోసం సేకరించిన భూముల వివాదాల వివరాలు కూడా అందజేయాలని సూచించారు. పది అంశాలతో ఫార్మట్‌ను తయారు చేశారు.

వలస వెళ్లిన విద్యార్థి.. పాము కాటుతో మృతి

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన నరేంద్ర (13) పాము కాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కోసిగి మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన హాల్వి మహానంది, నర్సమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో రెండో కుమారుడు నరేంద్ర స్వగ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. నరేంద్ర తల్లిదండ్రులతో పాటు కర్ణాటక రాయచూరు జిల్లాకు వలస వెళ్లాడు. మంగళవారం పత్తి పొలంలో పనిచేస్తూ పాము కాటుకు గురయ్యాడు. గమనించిన తల్లిదండ్రులు రాయచూరులోని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలో మృతి చెందాడు. బుధవారం నరేంద్రను స్వగ్రామమైన వందగల్లుకు తీసుకువచ్చారు. నరేంద్ర చదువుతున్న పాఠశాల హెచ్ఎం గిడ్డయ్య, ఉపాధ్యాయులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

త్రిమూర్తుల స్వరూపమే 'దత్తాత్రేయుడు'





కర్నూలు నగరంలో ముస్తాబైన సాయిబాబా ఆలయాలు

• నేడు దత్త జయంతి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గురుతత్వానికి ఆద్యుడు, త్రిమూర్తుల స్వరూపుడు, దేవతలకు జ్ఞాన బోధన చేసిన దత్తాత్రేయ స్వామి జయంతిని గురువారం జిల్లాలోని హైందవ భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఏటా మార్గశిర పౌర్ణమి రోజున దత్త జయంతి వచ్చేస్తుంది. కాగా ఈ ఏడాది గురువారం రోజున స్వామివారి జయంతి రావడం భక్తులు విశేషంగా భావిస్తున్నారు. జిల్లాలోని వివిధ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అఖండ సాయినామ పారాయణాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. షిరిడీ సాయినాధుడు సాక్షాత్తు దత్తాత్రేయుడి స్వరూపంగా భక్తులు ఆయనను కొలుస్తారు. ఈ నేపథ్యంలో దత్తజయంతికి సాయిబాబా ఆలయాలు ప్రత్యేక పూజాది కార్యక్రమాలకు సిద్ధమయ్యాయి. దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని నగరంలోని దక్షిణ షిరిడీగా పేరొందిన సాయిబాబా దేవస్థానంలో బుధవారం నుంచి గురువారం వరకు 24 గంటల పాటూ అఖండ సాయినామ స్మరణ చేపట్టారు.

గురువారం రోజున విష్ణు సహస్రనామ పారాయణాలు, మహాభిషేకము, అన్నప్రసాదం వితరణ, దునిపూజ, సాయి వ్రతము, మధ్యాహ్న హారతి, సాయంత్రం సంధ్యా హారతి, పల్లకీ సేవ, అల్పాహార వితరణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కార్యదర్శి ఎస్‌జీ మహాబలేష్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని హనుమాన్ ద్వారకామాయి దేవాలయంలో, కొత్తపేటలోని నాగసాయి ఆలయంలో, వెంకటరమణ కాలనీలోని సాయి మందిరంలో ప్రత్యేక పూజలు, విశేష హారతి నిర్వహిస్తున్నారు.

మల్లన్న సేవలో టీమిండియా క్రికెటర్లు



ఆలయంలో టీమిండియా క్రికెటర్లు

శ్రీశైలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను టీమిండియా క్రికెటర్లు జితేష్ శర్మ, రవి బిష్ణోయ్‌లు బుధవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానగోపురం వద్ద అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. క్రికెటర్లు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

మరణంలోనూ వీడని బంధం

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కష్టసుఖాల్లో ఒకరికొకరు కలకాలం తోడు ఉంటాననీ చేతిలో చేయేసి ఒట్టు పెట్టిన ఆ దంపతులూ కాటికి కూడా కలిసేవెళ్లారు.

• అనారోగ్యంతో భర్త మృతి
• గంట వ్యవధిలోనే భార్య మృతి
• డి.బెళగల్‌లో విషాదం



వీరారెడ్డి, పారిజాతమ్మ(ఫైల్)

భర్త మరణించిన కొద్దిసేపటికే భార్య కూడా తనువు చాలించిన విషాద ఘటన కోసిగి మండలంలోని డి.బెళగల్ గ్రామంలో జరిగింది. వివరాలు.. డి.బెళగల్ గ్రామా నికి చెందిన వై.పెద్ద వీరారెడ్డి(75), భార్య వై.పారిజాతమ్మ(73) ఇద్దరు కలిసి వ్యవసాయ పనులు చేసుకుం టూ జీవించేవారు. ఇటీవల పెద్ద వీరారెడ్డి అనారోగ్యానికి గురికావడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలిసిన భార్య వై.పారిజాతమ్మ కూడా తట్టుకోలేక గంట వ్యవధిలోనే తనువు చాలించింది. ఒకే రోజు భార్యభర్తల మృతితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

డ్రిప్ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు

• 12 శాతం నుంచి 5 శాతానికి: ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాస్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డ్రిప్ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సూక్ష్మ సేద్య పథకం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎస్టీ తగ్గుదల వల్ల డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలన్న రైతులకు ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందో వివరించారు. ఈ సంవత్సరం కర్నూలు జిల్లాలో డ్రిప్, స్ప్రింకర్ల యూనిట్లను 7వేల హెక్టార్లలో లక్ష్యం చేసుకున్నట్లు తెలిపారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, పదెకరాల పొలం ఉన్న రైతులకు 90 శాతం రాయితీ, పదెకరాలకు పైబడి ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఉందని తెలిపారు. త్వరితగతిన దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ డ్రిప్ ఏర్పాటు చేసేలా అనుమతి మంజూరు చేస్తున్నట్లు పీడీ శ్రీనివాసులు, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఇప్పటి వరకు 3,245 మంది రైతులు, 4,045 హెక్టార్లకు డ్రిప్‌ను ఏర్పాటు చేసేందుకు రైతులు తమ వాటాను చెల్లించారని తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



గుడ్ల స్టాకును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సిరి, చిత్రంలో పీడీ విజయ

- నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆగ్రహం
- కార్యకర్త తొలగింపు.. సూపర్‌వైజర్‌కు షోకాజ్

కోడుమూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-4ను కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు అందిస్తున్న పాలు, గుడ్లు రికార్డులను పరిశీలించారు. స్టాకు, రికార్డుల్లో చూపిన సంఖ్యకు పొంతన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 1,309 గుడ్లు స్టాకు చూపగా, 1,584 గుడ్లు ఉన్నట్లు గుర్తించి ఎందుకు పంపిణీ చేయలేదని కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్నా, వందశాతం హాజరు నమోదు చేసినట్లు, ప్రీ స్కూల్ కిట్లు వినియోగించకపోవడాన్ని గమనించారు. పిల్లలు ఆంగ్ల అక్షరాలు కూడా చెప్పలేకపోతున్నారని, ఏమి నేర్పుతున్నారని ప్రశ్నించారు. వయసుకు తగ్గ బరువు, ఎత్తు నమోదు రిజిస్టర్ నిర్వహించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రం అపరిశుభ్రంగా ఉండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అంగన్వాడీ కార్యకర్త పాతిమాను విధులు నుంచి తొలగించాలని, సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీ విజయను ఆదేశించారు. తహసీల్దార్, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు అంగన్వాడీ, పాఠశాల, వైద్యశాలలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ విజయ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రాముడు, సీడీపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఈవో డాక్టర్ వేణుగోపాల్

కోడుమూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలు, వ్యసనం-పర్యవసానాలు, సైబర్ క్రైమ్స్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు బానిసగా మారి, తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ వాడకంతో వ్యక్తిగత సంబంధాలను కోల్పోతున్నారని, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ సీఐ మంజుల మాట్లాడుతూ డ్రగ్స్ మత్తు పదార్థాలతో అవయవాలు దెబ్బతిని, రోగనిరోధక శక్తి తగ్గుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబరు 1972 కు ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ షేక్షావలి పాల్గొన్నారు.

నేడు ఘంటసాల జయంతి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివంగత సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల జయంతి సందర్భంగా ఆయకర్ భవన్ సర్కిల్ వద్ద నివాళి అర్పించనున్నట్లు ఘంటసాల గానకళాసమితి అధ్యక్షుడు సుస్వరం వాసుదేవరావు ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు న్యూరో సర్జన్ డాక్టర్ డబ్బా సీతారాం, డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ బి.శంకరశర్మ, డాక్టర్ ఉమానాథరావు, డాక్టర్ సీఎ నగేశ్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కేసీ కల్కూర హాజరవుతారన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కర్నూలు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. బుధవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో రైతన్న మీకోసం'లో పాల్గొన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు రైతులకు అండగా ఉన్నారన్నారు. పంట లాభాల పెంపు, ఆధునిక సేద్య పద్ధతులు, సబ్సిడీ వివరాలను తెలిపారు. ఏవో రూఫస్, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సంబరాలు..

కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో బుధవారం టీడీపీ కన్వీనర్ బుర్రవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండల వైసీపీ ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో టీడీపీ నెగ్గిన విషయం తెలిసిందే. ఎంపీపీ వెంకటేశ్వరమ్మను పదవి నుంచి తొలిగించడంతో ఆమె స్వగ్రామం ఉల్చాలలో విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు బాణసంచ కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాబా దామాషా మేరకు బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం బిర్లా కాంపౌండ్‌లో సంఘం జాతీయ కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించాలని, బీసీల రక్షణకు చట్టం చేయాలన్నారు. అయ్యన్న, ధనుంజయ, అఖిల, సింధూ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు అన్నారు. బుధవారం ఆర్.కానాపురం గ్రామంలో 'రైతన్నా మీకోసం' నిర్వహించారు. సీఎం చంద్రబాబు రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపాడు బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కురువ చంద్రిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం సరిత తెలిపారు. బుధవారం మాట్లాడుతూ నంద్యాల జిల్లా పద్మావతి నగర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. చంద్రికను అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మహారాష్ట్రలో చత్రపతి శంభాజీనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.



చంద్రికను అభినందిస్తున్న హెచ్‌ఎం

పిల్లల్లో లోపాలను త్వరగా గుర్తించాలి

- జీజీహెచ్ పిడియాట్రిక్ విభాగాధిపతి డా. విజయానంద్ బాబు



పిల్లల ఆరోగ్యంపై వివరిస్తున్న డా. విజయానంద్ బాబు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో మానసిక, శారీరక పెరుగుదల లోపాలను త్వరగా గుర్తించి చికిత్స అందించాలని జీజీహెచ్ చిన్న పిల్లల విభాగాదిపతి డా.విజయానంద్ బాబు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బాలల సత్వర కేంద్రం (డైస్)లో పునరావాస దినోత్సవం నిర్వహించారు. గర్భంతో ఉన్నప్పుడే సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే పుట్టబోయే శిశువులో వైకల్య లోపాలను అధిగమించవచ్చన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి వారికి పూర్తిగా చికిత్స అందించడమే రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వాస్థ్య కార్యక్రమం ఉద్దేశమన్నారు. పుట్టుకతో వచ్చే జలుబు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు, అంగ వైకల్య వ్యాధులకు జిల్లా సత్వర కేంద్రంలో చికిత్సతో పాటు స్పీచ్ థెరపీ వ్యాయమాలు తల్లులకు నేర్పిస్తారన్నారు. డా.జి.శారద, డా.సుహాసిని, డా.శ్రీలత, డా.ఆనంద ప్రకాష్, డా.కృష్ణ, డైస్ చిన్న పిల్లల వైద్యులు డా.సృజన, మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

పన్ను ఎగవేతదారులపై కొరడా

- వ్యాపార సముదాయాలు సీజ్



వ్యాపార సముదాయాన్ని సీజ్ చేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించకుండా కాలయాపన చేసే వ్యాపార, వాణిజ్య సముదాయాల ఆస్తులను జప్తు చేస్తామని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ హెచ్చరించారు. బుధవారం ముజఫర్‌నగర్ సమీపంలోని న్యూడిల్స్ తయారీ పరిశ్రమ యాజమాని గోవర్ధన్ నగర్ ఎస్.రాధాక్రిష్ణ మూర్తి రూ.8,53,761, ఆటోనగర్ స్టార్ మోటార్స్‌కు చెందిన రూ.4,96,566 ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో రెండు వ్యాపార సముదాయాలను అడిషనల్ కమిషనర్, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, రెవెన్యూ విభాగ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే.. సంకల్పానికి కాదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం శరీరానికేనని, మనుషుల సంకల్పానికి కాదని ఉమెన్ డెవలప్‌మెంట్, చైల్డ్ వెల్ఫేర్ డిజేబుల్ ఓల్డ్ ఏజ్, ట్రాన్స్‌జెండర్ కమిటీ ఛైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విభిన్న ప్రతిభావంతులకు ఇచ్చే పింఛన్ రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచిందన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా, ఉత్సాహంగా ఉంటారని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు 2016 చట్టంలో 21 డిజెబిలిటీ అంశాలు, ఇందులోని 12వ క్లాజ్ ప్రకారం అందరికీ సమన్యాయం అందుతుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి రయీస్ ఫాతిమా, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, మెప్మా పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం పెద్దటేకూరులో చేపట్టిన 'రైతన్నా..మీకోసం' కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. బిందు సేద్యాన్ని గత ప్రభుత్వం రద్దు చేయగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని. పంట మార్పిడి, అంతర పంటలు, భూసార పరీక్షలు, ఎరువుల వాడకం, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్‌ల ఉపయోగం, పశు సంపదపై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ మునిస్వామి, ఉలిందకొండ సింగిల్‌విండో ఛైర్మెన్ ఇ.వి.రమణ, వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్నాథం, రఘురాముడు, యాగంటయ్య, దొడ్డిపాడు బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభలో ముందంజ..

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన రామాంజనేయులు రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారు. 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా గుంటూరులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి, జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేశారు.



బంగారు పతకంతో రామాంజనేయులు

12 నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేఎస్ భూషణ్‌రావు మెమోరియల్ స్మారక రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు మురళీకృష్ణ, ముస్తహీర్ బుధవారం తెలిపారు. విజేతలకు నగదు, మెమొంటో ఇస్తామని తెలిపారు. పురుషులకు మాత్రమే పోటీ ఉటందన్నారు. ఆసక్తి గలవారు 7989173121, 9885907273 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, మాంటిస్సోరి పాఠశాలల అధినేత రాజశేఖర్ హాజరవుతారన్నారు.

7న జూడో ఎంపికలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ బాలుర ఉర్దూ పాఠశాలలో ఈ నెల 7న క్యాడేట్, జూనియర్ కేటగిరిల్లో బాలబాలికలకు జిల్లా స్థాయి జూడో ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి చంద్ర తెలిపారు. క్యాడెట్ కేటగిరిలో 2008-2010 లో జన్మించి ఉండాలని, జూనియర్ కేటగిరిలో 2005-2010 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. వివరాలకు 9866621891, 9059193725 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నలుగురి డిబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు ఆర్‌యూ పరీక్షల విభాగం కన్వీనరు డా.ఎస్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 27 పరీక్ష కేంద్రాల్లో 8,400 మంది దరఖాస్తు చేసుకోగా 7,566 మంది పరీక్షలు రాశారన్నారు. మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడిన విద్యార్థులను స్క్వాడ్ బృందాలు డిబారు చేశాయని పెర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

కోడుమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ బుధవారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆవరణను పరిశీలించి, కేసులకు సంబంధించిన రికార్డుల ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల పురో గతిపై సీఐ తబ్రేజ్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది చట్టాలపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచిం చారు. ఎస్ఐ డిపై స్వామి, మణికంఠ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ..

ద్విచక్రవాహనదారులు సురక్షిత ప్రయాణం కోసం హెల్మెట్‌ను ధరించాలని పోలీసులు సూచించారు. పట్టణంలోని కోట్ల సర్కిల్లో వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ దరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకోవాలన్నారు.

దివ్యాంగుల దినోత్సవం



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈవో

ఓర్వకల్లు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం హేమాంబరరెడ్డి, ఫిజియోథెరపిస్టు కిరణ్ మనోహర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆఫీసులో మద్యం తాగుతూ విధులు

- ఆర్అండ్‌బీ కార్యాలయ ఉద్యోగి, పక్కనే ఓ ఏఎస్ఐ



మద్యం బాటిల్‌తో ఉద్యోగి

కర్నూలు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు సమీపంలో ఉన్న ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఓ ఉద్యోగి మద్యం తాగుతూ విధులు నిర్వర్తిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రహస్యంగా వీడియో చిత్రీకరించిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఉద్యోగి పక్కనే ఓ ఏఎస్ఐ ఉండటం విశేషం. కార్యాలయంలో మద్యం తాగుతూ ఉండటంపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. బుధవారం కేకే భవన్‌లో పోస్టర్‌ను విడదల చేశారు. మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మహాసభల్లో చర్చిస్తామన్నారు జనవరి 4న జరిగే మహ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. న్యూసిటీ అధ్యక్షుడు నగేష్, నగర కార్యదర్శి నరసింహులు, కోశాధికారి సీహెచ్. సాయిబాబ, ఉపాధ్యక్షుడు రాముడు, సుధాకరప్ప, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద నిరసన

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతలూ 12న కలెక్టరేట్ వద్ద నిరసన తెలపనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలిత అన్నారు. చేశారు. బుధవారం కేకే భవన్‌లో మాట్లాడుతూ 2023సమ్మె కాలపు మినిట్స్ కాపీని టీడీపీ వచ్చినా వేతనాల పెంపు సంక్షేమ పథఖాలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లు, ఆధార్, ఆపార్, అభా పేరుతో పనిభారం పెంచారన్నారు. రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, ఆర్.నరసింహులు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్ఐ హనుమంత రెడ్డి హెచ్చరించారు. బుధవారం పాత బస్టాండ్‌లో వాహనదారులతో మాట్లాడుతూ హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని చట్టాన్ని అతిక్రమించే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

సీలంబమ్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో హెచ్‌ఎం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7 తేదీల్లో గుంటూరులో నిర్వహించే రెండవ సౌత్‌జోన్ సీలంబమ్ చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. వెంకటరమణ కాలనీ సహస్ర పాఠశాలలో వికాస్ బిల్డర్స్ అధినేత వికాస్ వీరికి క్రీడాదుస్తులు అందజేశారు. సౌత్‌జోన్ పోటీలో ప్రతిభ చాటి విజేతలుగా రావాలన్నారు. హెచ్‌ఎం అన్నపూర్ణ, జిల్లా కార్యదర్శి బి.మహావీర్ బహదూర్ పాల్గొన్నారు.

నేడు నంద్యాలలో ఎన్జీవోల సమావేశం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సమావేశం గురువారం నంద్యాలలో నిర్వహిస్తున్నట్లు నగర అధ్యక్షుడు కాశన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, రమణ, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి హాజరు కానున్నారన్నారు. తాలుకాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు హాజరు కావాలన్నారు.

వైసీపీ విష ప్రచారం

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వైసీపీ నాయకులు విషం చిమ్ముతున్నారని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమం చూడలేక వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.

శిథిల భవనాన్ని పరిశీలించిన జేసీ





శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయ భవనాలను పరిశీలిస్తున్న జేసీ నూరుల్ కమర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ప్రాంగణంలోని శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయ శిథిల భవనాలను జేసీ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'శిథిల భవనం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జేసీ గదులను పరిశీలించి, వీలైనంత త్వరగా అక్కడ కార్యాలయం, రికార్డులను కలెక్టరేట్ ప్రాంగణంలోని మరో గదికి మార్చాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల ఆకాంక్ష న్యాయమైనది

- జనసేన జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్
- ఆదోని జిల్లా సాధన సమితి దీక్షలకు మద్దతు
- రోజురోజుకూ పెరుగుతున్న డిమాండ్

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా కోసం పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గాల ప్రజల ఆకాంక్ష న్యాయమైనదని జనసేన జిల్లా అధ్యక్షుడు చింత సురేష్ అన్నారు. 17 రోజులుగా ఆదోని జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న రిలే దీక్షలకు మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. మల్లప్ప మాట్లాడుతూ ఆదోనిని జిల్లా చేయాలని దీక్షలు చేపట్టినప్పటి నుంచి తాము ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. రాజకీయ నాయకులు ప్రోద్బలంతో జరుగుతున్న డిమాండ్ కాదని ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష అన్నారు. ప్రజల పోరాటంలో తాము భాగస్వాములము అవుతామన్నారు. అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందాలంటే జిల్లా కావాల్సిందే అన్నారు. జేఏసీ నాయకురాలు లలిత జితేంద్ర మాట్లాడుతూ ఆదోనిని జిల్లా చేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ప్రజల నుంచి, వివిధ వర్గాల నుంచి రోజురోజుకు మద్దతు పెరుగుతుందన్నారు. దీక్షలో అగ్రి డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి, లక్ష్మన్న, ఈరన్న, ఉదయ్, వీరభద్ర, కృతిక్, కురువయ్య రఘు, ఆలూరు ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజి, ప్రకాష్, ఎల్లప్ప ఉచ్చిరప్ప, శ్రీను కూర్చున్నారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బసాపురం రామస్వామి, కాంగ్రెస్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్ జేఏసీ నాయకులు కృష్ణమూర్తి గౌడ్, కోదండ కుంకునూరు వీరేష్, దస్తగిరి నాయుడు, తిరుమలేష్, నంద రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్ప

● **కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

ఆదోని పర్యటనకు వచ్చిన కలెక్టర్ డాక్టర్ సిరికి ఆదోని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆదోనిని జిల్లా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాసాధన సమితి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన: ఎమ్మెల్యే

వెల్దుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి రైతుసేవా కేంద్రంలో ఏఓ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వ్యవసాయం లాభసాటి చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. 90శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలను అందిస్తోందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న చెరువులన్నింటికీ నీటితో నింపామన్నారు. అంతకుముందు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు, నాయకులు సుబ్బారాయుడు, సింగిల్‌విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి, ఈదుల వెంకటరాముడు, ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తుగ్గలి: వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిస్తే అభివృద్ధి చెందుతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ అధ్యక్షతన రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ఐదు ముఖ్య సూత్రాల కార్యక్రమాలు పాటిస్తే వ్యవసాయంలో రాణించవచ్చన్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోతే గతం మాదిరే సాగు చేసిన పంటల నష్టాన్ని మిగులుస్తాయన్నారు. ఈ సమావేశంలో ఏఈఓ సరస్వతి, మాజీ ఎంపీపీ భాస్కర్, విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర: టార్పాలిన్లను సబ్సిడీపై అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారి రవి రైతులు కోరారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్న రైతులు వ్యవసాయ శాఖ అధికారి రవితో మాట్లాడుతూ తుఫాన్ వచ్చినప్పుడు మేము సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్లు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పారా విఠోబ, పశువైద్యాధికారి లక్ష్మన్న, రైతులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయ కుడు ఉమాపతి నాయుడు అన్నారు. బుధవారం రైతన్న మీ కోసం కార్యక్రమా న్ని వ్యవసాయ శాఖ ఏడీవో బాలవర్ధి రాజు, ఏవో సుధాకర్‌ల అధ్యక్షతన దొడ్డన గేరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం 17నెలల్లోనే సూపర్‌సిక్స్‌ను అమలు చేసిన ఘనత కూటమి ప్రభు త్వానికి దక్కిందన్నారు. ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు హెక్టార్‌కు రూ.50వేలు చొప్పున ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రంగస్వామి, సర్పంచ్ పార్వతమ్మ, శివప్ప, శ్రీకాంత్ రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

అన్నదాత సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆస్పరి: అన్నదాత సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైకుంఠం జ్యోతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సహకార సంఘం సొసైటీ చైర్మన్ రత్నమ్మ, మాజీ ఎంపీపీ కృష్ణయాదవ్, సొసైటీ డైరెక్టర్ సంజన్న, నౌనేపాటిచౌదరి, ఎంపీటీసీ నరసన్న పాల్గొన్నారు.

పొలాల్లో దొంగలు

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించుకుంటున్న వ్యవసాయ తోటలపై దొంగలు టార్గెట్ చేశారు. వేలకు వేలు చేసి పంటలకు విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు అమర్చుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన ఆయిల్ కాపర్ వైర్‌లను ఎత్తుకెళ్లారు. మండల పరిధిలోని పెరవలి గ్రామంలో 15 వ్యవసాయ తోటల్లో వైర్లను ఎత్తుకెళ్లారు. మోటార్లను సైతం దోచుకెళ్లారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని పెరవలి గ్రామంలో రైతులు వ్యవసాయ తోటలకు పంటలు పండించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న మోటారు వైర్లను, మోటార్లను బుధవారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లారని రైతులు కొండేటి సుధాకర్, నరసన్న, రంగన్న, భాస్కర్ అంజన్, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు గస్తీ నిర్వహించి దొంగతనాలను అదుపు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంచాయతీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలో ఆయా ప్రధాన కూడళ్లలో పంచాయతీ స్థలాల్లో రోడ్డుకిరువైపులా చెత్త వేస్తే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో వై.శివకుమార్ అన్నారు. బుధవారం మద్దికెర గ్రామంలోని బసవన్న గుడి ప్రాంతంలో పంచాయతీ స్థలాల్లో చెత్తను వేయడంతో కార్మికుల సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పలు ప్రాంతాల్లో చెత్త వేసిన వారికి నోటీసులు జారీ చేశామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనాయునపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. బుధవారం గ్రామంలో మరమ్మతులకు నోచుకోని నీటి పథకానికి సంబంధించి మోటార్లను బాగు చేసి నీటిని వదిలారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ఈ నెల 2వ తేదీన 15 రోజులుగా నీరు వదలడం లేదని వార్తను ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు వెంటనే మోటారును బాగు చేసి నీటిని వదిలారు.


నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

పోస్టాఫీసులో సొమ్ము మాయం!

● లబోదిబోమంటున్న బాధితుడు



జమ అయినట్లు చూపుతున్న పాస్‌బుక్, బాధితుడు మల్లికార్జున

మద్దికెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్తు కోసం పోస్టాఫీసులో సొమ్మును పొదుపు చేసుకుంటే, ఆ పొదుపు సొమ్ము మాయమైందని గ్రామానికి చెందిన మల్లికార్జున ఆరోపించారు. మద్దికెర గ్రామానికి చెందిన గొడుగు మల్లికార్జున అనే వ్యక్తి తన కుమార్తె భవ్యశ్రీ పేరు మీద సుకన్య సమృద్ధి పథకం ద్వారా 2015 నుంచి రూ.50వేల చొప్పున డిపాజిట్ చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా 11-2-2023లో సంబంధిత లబ్ధిదారుడు తన కూతురు పేరు మీద తమ ఖాతా పుస్తకంలో అప్పటి తపాలాశాఖ అధికారి రమణమూర్తికి రూ.20వేలు ఇచ్చారు. అందులో భాగంగా సదురు పోస్టుమెన్ రూ.20వేలు జమ అయినట్లు పాసు పుస్తకంలో కూడా రాసి ఇచ్చారు. అయితే ఆన్‌లైన్‌లో మాత్రం కేవలం రూ.2వేలు మాత్రమే జమ అయినట్లు చూపిస్తుండటంతో లబ్ధిదారుడు తన ఖాతాలో సొమ్ము మాయమైందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై ప్రస్తుత పోస్టుమాస్టర్ రమేష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. జరిగిన విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలి

దేవనకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం షరతులు లేకుండా సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పత్తిపంటను మార్కెట్‌కు తీసుకెళ్తే తేమశాతమంటూ తక్కువ ధరకు కొనుగోలు చేయడం సరికాదన్నారు. ఈ నెల 10న జిల్లాలో రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా నాయకులు మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి నర్సారావు, శేఖర్, కండప్ప, రాజశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

సీపీఐతోనే ప్రజా సమస్యల పరిష్కారం

తుగ్గలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐతోనే ప్రజా సమస్యల పరిష్కారం అవుతాయని జిల్లా కార్యవర్గ సభ్యులు నబీ రసూల్, మండల కార్యదర్శి సుల్తాన్, జిల్లా సమితి సభ్యులు రోళ్లపాడు వెంకటేశ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బొందిమడుగులలో సీపీఐ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ పార్టీ పేదల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేస్తూనే ఉంటుందని, ప్రజలకు ఏ కష్టమొచ్చినా సీపీఐ ముందుంటుందన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ఎన్టీఆర్ విగ్రహం

తుగ్గలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగింటి ఆత్మగౌరవాన్ని పెంచిన ఎన్టీరామారావు విగ్రహాన్ని ప్రారంభించేందుకు టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ నెల ఆరో తేదీన మండలంలోని రాతన గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మనోహర్ చౌదరి విలేకరుల సమావేశంలో తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశానికే చాటి చెప్పిన మహానీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన చూపిన బాటలోనే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పార్టీని నడిపిస్తున్నారన్నారు. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు.


రాతనలో ఎన్టీఆర్ విగ్రహం

హెల్మెట్ ధరించండి : సీఐ

తుగ్గలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్ఐ బాలనరసింహులు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన తుగ్గలిలో వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత నియమాలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆదోని రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో నాగరాజు స్వామి అన్నారు. బుధవారం ఈవోపీఆర్డీ మల్లికార్జునతో కలిసి కుప్పగల్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విధులకు సక్రమంగా రావాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హు లైన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది సూచించారు. అనం తరం పెద్దతుంబళం పీహెచ్‌సీ డాక్టర్ ఆశలతతో సమావేశమై ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు చేపట్టాలని సూచిం చారు.

'మాది డబుల్ ఇంజన్ ప్రభుత్వం'

హాలహర్వి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాది అభివృద్ధిలో దూసుకుపోతున్న ప్రజా డబుల్ ఇంజన్ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. బుధవారం క్షేత్రగుడి వద్ద ఏర్పాటు చేసిన జనసేన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యకర్తలతో పాటు జనసేన, బీజేపీ కార్యకర్తలు సైతం తమకు సమానమేనన్నారు. కొంతమంది వైసీపీ గుంటనక్కలు మళ్లీ పార్టీలోకి రావాలని విశ్వప్రయత్నం చేస్తున్నారని, కానీ వారికి పార్టీలో స్థానం లేదన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కలిసిగట్టుగా సమన్వయంతో పని చేద్దామన్నారు. ఇక్కడ గెలుపొందిన ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడకుండా రోడ్లు వెంబడి మాట్లాడడం చాలా దౌర్భాగ్యమని జనసేన తాలూకా ఇన్‌చార్జి వెంకప్ప విమర్శించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఆదోని తాలూకా ఇన్‌చార్జి మల్లప్ప, మండల కన్వీనర్ శ్రీధర్, సీనియర్ నాయకులు గూళ్యం ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు కృషి

ఆలూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభ సాటిగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరగౌడ్, హార్టికల్చర్ అధికారి ఇందిర అన్నారు. బుధవారం మండ లంలోని హులేబీడు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రమేష్, ఎంపీ ఈఓ నరేష్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పత్తికొండ: మండలంలోని నలకదొడ్డి గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిం చారు. బత్తిన రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులు అవ లంబించేందుకు, ప్రకృతి వ్యవసాయం, టెక్నాలజీ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడి సాయం వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, టీడీపీ నాయకులు రాజారెడ్డి, రఘుశేఖర్, హర్షవర్ధన్, అగ్రికల్చర్ అధికారి భార్గవి, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పడాలి

ఆదోని రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని సంఘం అధ్యక్షుడు మొలగవల్లి రామాంజనేయులు కోరారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. రామాంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎంపీడీవో నాగరాజు స్వామి మాట్లాడుతూ దివ్యాం గులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీవో కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ బడాయి పొంపాపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్: దివ్యాంగులను ప్రోత్సహిస్తే చదువులో రాణిస్తారని ఎంఈవో భూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుమల నగర్ భవిత కేంద్రంలో దివ్యాం గుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగులను అందరి పిల్లలతో సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నిర్మలమ్మ, విజయలక్ష్మి, ఐఆర్‌టీఎం శాంత కుమార్ పాల్గొన్నారు.

ఆదోని: అంగవైకల్యం ఉన్న వారిని హేళన చేస్తూ అడ్డ పేర్లతో పిలవడం లేదా వారి వైకల్యాన్ని ఎత్తి చూపించడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి యజ్ఞ నారాయణ హెచ్చరించారు. సమాజంలో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత మంచి అభివృద్ధి సాధిస్తారని ఆయన అన్నారు. బుధవారం మండలంలోని ఆరేకల్ గ్రామంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఈరన్న, స్టీఫెన్ రాజు, లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

దేవనకొండ: కూటమి ప్రభుత్వంలోనే దివ్యాంగులకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్‌గౌడ్, జనసేన నాయకుడు వెంకప్ప అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా క్రాంతి దివ్యాంగుల సంఘం అధ్వర్యంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, ఎంఈవో తిమ్మారెడ్డి, ఏపీవో రాజునాయక్, టీడీపీ నాయకులు శాంతికుమార్, వైసీపీ నాయకులు లుబుంబా, నాయకులు దోని, ఆనంద్ పాల్గొన్నారు.

చిప్పగిరి: దివ్యాంగులను పోత్సహించాలని ఎంపీడీవో అల్లాబకాష్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సెక్రెడ్, రక్షణ, శ్రీసాయి సమాఖ్య అధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంగళవారం సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఏవో శ్రీనివాసులు, ఏపీవో శివయ్య, వీఆర్వో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బాలన్న పాల్గొన్నారు.

వెంచర్‌ను తనిఖీ చేసిన జేసీ

వెల్దుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి రామళ్లకోట రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్‌ను జాయింట్ కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ నూరుల్ కామర్ బుధవారం తనిఖీ చేశారు. వెల్దుర్తి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 282, 283, 288, 308, 309, 310 లో దాదాపు 17 ఎకరాల డీఆర్ వెంచర్‌ను పరిశీలించి తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, వీఆర్‌ఓ పద్మలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఐవీఆర్ఎస్ కాల్స్‌పై అవగాహన

వెల్దుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఐవీఆర్ఎస్ కాల్స్, చెత్త సేకరణ అంశాల గురించి అధికారులను ఆరాతీశారు. 9వ వార్డు ముల్లా వీధిలో రస్తా సమస్యపై కాలనీ వాసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చెత్తచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ పనులు నిర్వహించి, గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

వెల్దుర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని(సీహెచ్‌సీ) వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.5లక్షల విలువ చేసే నూతన ఎక్స్-రే యంత్రాన్ని జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్‌తో కలిసి ప్రారంభించారు. సూపరింటెండెంట్ బాలచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో డీసీహెచ్ఎస్ జఫ్రుల్ల ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యుల పనితీరు, ఆసుపత్రి సౌకర్యాల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఆసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.

అర్హులకు ఇంటి పట్టాలివ్వండి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన లబ్దిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కోరారు. బుధవారం సీపీఐ నాయకులు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి టీ.కృష్ణ మాట్లాడుతూ రాజకీయ జోక్యం లేకుండా పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో కొండ,గుట్టల్లో స్థలాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి జనావాసాల్లో స్థలాలు కేటాయించాలని కోరారు. అదే విధంగా అనధికార భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నమాదులు, డి.రాజు పాల్గొన్నారు.

ముని రంగస్వామి జాతర

తుగ్గలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గౌతమ మహాముని కొండల్లో వెలసిన రంగస్వామి జాతర వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం మండల పరిధిలోని లింగనాయునిదొడ్డి గ్రామ శివారులో వెలసిన రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పీఠాధిపతి పక్కీరప్పస్వామికి కూడా అభిషేక పూజలు చేశారు. గురువారం జరగబోయే జోడు రథోత్సవాలకు ఏర్పాట్లు చేశామని పీఠాధిపతి శ్రీనివాసస్వామీజీ, ఆలయ నిర్వహకులు కృష్ణారెడ్డి తెలిపారు.

కనీస వేతనం ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. మంగళవారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ కార్మికుల సమావేశం జరిగింది. మునెప్ప మాట్లా డుతూ కార్మికులకు పనికి తగ్గ వేతనంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎంకప్ప రాజు, ఎంప్లాయీ స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి, అనీఫ్, నవీన్, రాము, దొరబాబు పాల్గొన్నారు.

శ్మశానానికి రూ.5లక్షలు

హలహర్వి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారపల్లి గ్రామంలో శ్మశానానికి బీజేపీ నాయకులు కమలమ్మ, నారాయణ దంపతులు రూ.5 లక్షలు బుధవారం అందించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్నామని బీజేపీ నాయకులు కమలమ్మ, నారాయణలకు గ్రామస్థులు తెలిపారు. దీంతో వారు శ్మశానానికి రూ.5 లక్షలు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత, తిమ్మప్ప, జనార్దన, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

దేవనకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవస్వామి కాలనీలో జనసేన ఆధ్వర్యంలో ఐదు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు కె ఉచ్చీరప్ప తెలిపారు. కాలనీవాసులకు గత కొన్నేళ్లుగా కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈవిష యాన్ని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకురావడంతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మంచి దిగుబడులు సాధించాలంటే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో గ్రామ రైతుసేవా కేంద్రాల్లో మీకోసం రైతన్న కార్యాచరణ ప్రణాళికపై గ్రామసభలు నిర్వహించారు. హోసూరు గ్రామంలో జరిగిన రైతన్న మీకోసం కార్యాచరణ ప్రణాళిక గ్రామసభలకు మార్కెట్‌యార్డు చైర్మన్ నబిసాబ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి తదితరులు హాజరయ్యారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి : కలెక్టర్



పురుగుల నివారణ పరికరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో అధిక దిగుబడి సాధ్యమని కలెక్టర్ సిరి తెలిపారు. బుధవారం కడిమెట్ల గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ప్రతిసారి ఒకే పంటను సాగుచేసుకోవడం వల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు రైతులకు అందజేసే సేవలను తెలుసుకున్నారు. అలాగే ప్రత్యక్షంగా సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. అంతకుముందు కడిమెట్ల గ్రామంలో తహసీల్దార్ శేషఫణిపై కలెక్టర్ సిరి అసహనం వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకూడదని ఆదేశించారు. టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేష్, సహకార సొసైటీ బ్యాంకు చైర్మన్ విరుపాక్షిరెడ్డి, కాపు మురళీకృష్ణారెడ్డి, చంద్ర, రవికుమార్, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో శివశంకర్, ఏఈవో నరసింహులు, ఆయాశాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



రాఘవేంద్రరెడ్డిని, అధికారులను సన్మానించిన నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులుగా అండగా ఉంటోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండలంలోని చెట్నహళ్లిలో బుధవారం ఏవో జీరాగణేష్, ఆర్టికల్చర్ అధికారి అపర్ణ, మండల పశువైద్య అధికారి సంతోష్, ప్లానింగ్ అధికారి రాజు, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం సీఎం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామాల్లో ఒకే పంటసాగు లేకుండా అంతరపంటలు, చిరుధాన్యాలు, ఉద్యానపపంటలు సాగు, బిందుసేద్యం ద్వారా సాగుచేసే విధానాలు వాటి దిగుబడి మార్కెటింగ్ వంటి అంశాలపై చర్చించారు. ఇందుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరెడ్డికి, మండలస్థాయి నాయకులకు, అధికారులకు శాలువా పూలమాలలో చెట్నహళ్లి టీడీపీ నాయకులు సత్కరించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, మాజీ సర్పంచ్ చావడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ ఆర్.లక్ష్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు, సొసైటీ డైరెక్టర్లు డీసీ తిమ్మప్ప, నగేష్, లక్ష్మన్న, డిప్యూటీ ఎంపీడీవో రామాంజ నేయులు, ఏఈవో తిరుమలరెడ్డి, టీడీపీ నాయకులు ఎస్పీ భాస్కర్ రెడ్డి, సూగూరు ఎల్లెల్సీ చైర్మన్ నరసింహ, నాగరాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

పంచ సూత్రాలతో వ్యవసాయం లాభసాటి



మాట్లాడుతున్న సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు

కౌతాళం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో లాభసాటిగా మారడానికి పంచ సూత్రాలు ఎంతో ముఖ్యమని కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు అధ్యక్షుడు వెంకటపతి రాజు అన్నారు. కౌతాళంలోని ఆర్ఎస్‌కేలో రైతన్నా మీ కోసం వర్క్‌షాపు వ్యవసాయాధి కారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటపతిరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు పంచ సూత్రాలతో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని చెప్పారు. కూటమి నాయకులు ఉసేనప్ప యాదవ్, విజయ్, వెంకన్న, రామాంజనేయులు, రాజానందు, సుభాన్ ఉన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందీ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో-1 గోవిందు, ఎంఈవో-2 రఘునాథ్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నందవరం హైస్కూల్‌కు ఒక పోస్టు, నాగలదిన్నె హైస్కూల్‌కు ఒకటి, పూలచింత పాఠశాలకు-1 హిందీ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే నందవరంలోని ఎంపీయూపీ (ఉర్దూ)కు ఒక పోస్టు మంజూరయినట్లు తెలిపారు. శుక్రవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీమఠం అన్నదానానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో అన్నదానానికి బెంగళూరుకు చెందిన నందీష్ కుమార్ అనే భక్తుడు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజరు ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

పత్తి లారీ బోల్తా.. ఇద్దరికి స్వల్ప గాయాలు

మంత్రాలయం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం- చెట్నహళ్లి గ్రామాల మధ్య బుధవారం అనంతపురం జిల్లాకు చెందిన పత్తిలోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివీ.. అనంతపురం జిల్లా పెద్దకొడగూరు మండలం కండ్లగూడూరు గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాదరెడ్డి లారీలో పత్తిని లోడ్‌చేసుకుని కర్నాటకలోని రాయచూరుకు విక్రయించేందుకు వెళ్తుండగా లారీ వెనక ఉన్న రెండుటైర్లు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొకరికి స్వల్పగాయాలతో ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు.

'ఇది రైతు ప్రభుత్వం'

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇది రైతు ప్రభుత్వమని టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలీ, మండల సహకార సంఘం అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నందవరం వ్యవసాయ కార్యాలయంలో సీఎం చంద్రబాబు వీడియోలో వ్యవసాయ పరికరాలు, డ్రిప్ సిస్టం, రైతులకు ఉపయోగ పడేలా ఇరిగేషన్ టెక్నాలజీ మార్పులపై సూచనలు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సరిత, మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బీమశేఖర్, వెంకటేష్, వడ్డె గోపాల్, ఆచారి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోసిగిలో ప్రబలిన విషజ్వరాలు

● ఇద్దరు చిన్నారులకు డెంగీ ● వాల్మీకీ నగర్‌లో లోపించిన పారిశుధ్యం

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని వాల్మీకి నగర్‌లో విష జ్వరాలు ప్రబలి చాలా మంది మంచాన బారిన పడ్డారు. అదే కాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు డెంగీ పాజిటివ్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరు, ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో మరో చిన్నారి వైద్యచికిత్సలు పొందుతున్నారు. కాలనీలో డ్రైనేజీలు నిండిపోయి తీవ్రమైన దోమల బెడద ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కనీసం వారానికి ఒకసారి కూడా డ్రైనేజీలు శుభ్రత చేయడం లేదని పంచాయతీ సిబ్బందిపై మండిపడుతున్నారు. అలాగే వైద్యులు ఇంటింటికి వచ్చి సమాచారం తెలుసుకోవడం లేదని, ఊరి చివరలో ఉన్న సబ్ సెంటరులలో ఉంటూ కాలయాపన చేసి వెళ్లిపోతున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికే కాలనీలో చాలా మంది చిన్నారులు జ్వరాల బారిన పడి ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆసుపత్రి సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కనీసం తమ కాలనీలో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఊరి చివరన ఉన్న సబ్ సెంటర్‌ను తమ కాలనీలోనే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు

జాతీయ స్థాయి గట్కా పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న బి.అఖిల అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో గెలుపొంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు బుధవారం హెచ్ఎం వినోభరావు, బసవరాజు, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర, నరసింహరాజు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎస్‌జీఫ్ అండర్-19 విభాగంలో గట్కా పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి జాతీయస్థాయి సింగిల్ షూటీ గట్కా టీం ఈవెంట్‌లో ఎంపిక కావడంతో మంత్రాలయానికి గుర్తింపు వచ్చిందని తెలిపారు. విద్యార్థిని అఖిలను ఉపాధ్యాయులు పాపన్న, గోపాల్, గోట్లచంద్రశేఖర్, నాయక్, ప్రసన్నకుమారి, ఉమామహేశ్వరి, పద్మావతి, సుల్తానా, సునంద, హరి అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఉపేంద్ర ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి బనవాసి మహమ్మద్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సుబ్బనారాయణ ఆదేశాల మేరకు రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు గోవిందు సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా సహాయ అధ్యక్షుడిగా అబ్దుల్ మజీద్, ఉపాధ్యక్షులుగా సుబకర్, శ్రీరామకృష్ణ, సహాయ కార్యదర్శిగా బనవాసికి చెందిన మహ్మద్, సంయుక్త కార్యదర్శిగా ఎస్ చాంద్‌బాషా, ట్రెజరర్‌గా బాలస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యశ్వంత్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాము ఎళ్లవేళలా పనిచేస్తామన్నారు.

డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న రమాకాంతరెడ్డి

పెద్దకడబూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): డిమాండ్ ఆధారిత పంటలను రైతులు సాగు చేయాలని రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి సూచించారు. బుధవారం పెద్దకడబూరులో రైతన్నా మీ కోసం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పంటల సాగులో పంట మార్పిడి చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. రైతులకు బ్యాంకులు, సొసైటీలు అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అనేక సబ్సిడీలు అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కురువ మల్లికార్జున, సింగిల్ విండో చైర్మన్ మీసేవా ఆంజనేయులు, ఎంపీఈవో రాఘవేంద్ర, సోనీ, హనుమంతు, ఆశన్న, ఇమ్మానియేల్, బొగ్గుల నరసన్న, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

గోనెగండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దేశ ఐక్యత కోసం పాటుపడి దేశాన్ని ఏకతాటిపై నిలిపిన మహనీయుడు సర్దార్ వల్లబాయ్ పటేల్ అని, ఆయన సేవలు మరువలేనివి అని కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, ఆర్ఐవో లాలప్ప, మై భారత్ జిల్లా యువజన కోఆర్డినేటర్ రాహుల్ అన్నారు. మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు సమీపంలోని జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం వాక్ ఫర్ యూనిటీ రైజ్ ఫర్ నేషన్ కార్యక్రమం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో యూనిటీ మార్చ్ సమావేశం చేపట్టారు. వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన సమయంలో దేశంలో 556 సంస్థానాలు ఉండేవని వాటిని ఏకం చేయక పోతే దేశం మొత్తం 556 చిన్నదేశాలుగా విడిపోయేదని వారు అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరెడ్డి, అధ్యాపకులు, యువజన నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

మంత్రాలయం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న చెప్పారు. బుధవారం మంగళగిరి లో ఏపీ రాష్ట్ర జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల జనరల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ పిడుగుహరిప్రసాద్, ఏపీ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ శివ శ్రీనివాసరావును కలిసి రాఘవేంద్రస్వామి మెమెంటో, ప్రసాదం ఇచ్చి శాలువాతో సన్మానించారు. మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ పటిష్టత, స్థానిక సంస్థల ఎన్నికలు వంటి అంశాలపై చర్చించారు. జనసేనపార్టీ బలోపేతానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో కలిసి పార్టీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన లక్ష్మన్న

17వ రోజుకు చేరిన సమ్మె



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష 17వ రోజుకు చేరుకుంది. బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చోని వినూత్నంగా రోడ్ల మీద కూర్చోని, నిల్చొని నిరసన చేట్టారు. ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు వీరేష్, కార్యదర్శి విజేంద్ర, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శిలు రంగన్న, ఆశా జ్యోతి, ఆగారమ్మ, సుమాంజలి, నబి నసీమా, లక్ష్మి, శేఖర్, ఎల్లప్ప పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

మంత్రాలయం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా మోటార్‌సైకిల్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మాధవరం చెక్‌పోస్టు దగ్గర ద్విచక్ర వాహనారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోలు పరిమతి మించి ప్రయాణికులను, భక్తులను ఎక్కించుకొనే ఆటోలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వైఎస్సార్ సర్కిల్ గల భవిత కేంద్రం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం ఐఈఆర్టీ ఎస్.బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులు ఎంఈవో ఆంజనేయులు, గోవిందు, తోగట నరసింహులు, ఎస్‌బిఐ మేనేజర్ మారెప్ప మాట్లాడుతూ ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని ప్రపంచానికి చాటి చేప్పే రోజు అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం అని అన్నారు. వీరికి కూడా సమాన హక్కులు కల్పిస్తూ వారి పట్ల ప్రేమ, గౌరవంతో వ్యవహరించాలన్నారు. ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని ఇప్పటికే చాలా మంది నిరూపించారన్నారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్వర్యంలో జిల్లా గవర్నర్ రవీంద్ర, రోటరి క్లబ్ ఎమ్మిగనూరు అధ్యక్షులు నటరాజ్ రెడ్డి పిల్లలకు కలర్ పెన్సిళ్లు, పుస్తకాలు అంద జేశారు. కార్యక్రమంలో మౌనిక, విజయలలిత, మురళీకృష్ణ, తిమ్మప్ప, ఇర్షాద్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: దివ్యాంగులకు అన్ని రంగాలలో రాణించలని ఎంఈవో రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శి సతీష్, జనసేన పార్టీ తాలుకా నాయకులు గానుగబాషా, మాలిక్ బాషా, టీడీపీ సీనియర్ నాయకుడు గంజహళ్లి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గోనెగండ్లలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రం దగ్గర పాఠశాల ఉపాధ్యాయులు అనూరాధ, ఆది నారాయణమ్మ నిర్వహించారు. భవిత పాఠశాల విద్యార్థులకు రామాంజినేయలు, సతీస్, వ్యాపారి ప్రసాద్‌శెట్టి విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరిమళ, శిరోమణి, కేర్‌గివర్ ఖాజాబీ, విజయరాణి, కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రాలయం: దివ్యాంగులు అన్నిరంగాలల్లో రాణించినప్పుడే వారికి గుర్తింపు దక్కుతందని ఎంఈంవోలు షైనుద్దీన్, రాగన్న అన్నారు. బుధవారం మంత్రాలయంలో భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానిన ఘనంగా నిర్వహించారు. భవితకేంద్రంలోని విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి ఐఈఏర్‌టీ



పెద్దకడబూరులో బహుమతులు అందజేస్తున్న అధికారులు

కళ్యాణి, శివప్రసాద్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో హెచ్ఎంలు బసవరాజు, రామ్మోహన్, వీరేష్, గోపాల్, నాగరాజునాయక్, సీఆర్‌పీలు నరసన్నగౌడు, బంగారప్ప, భీమేష్, లలితమ్మ, ప్రభకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: పెద్దకడబూరులో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో ఉస్మాన్‌బాషా, మెయిన్ పాఠశాల హెచ్ఎం వీరేష్‌రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి దివ్యాంగ తల్లిదండ్రులు తమ పిల్లలను భవిత సెంటర్‌కు పంపాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం తల్లికి వందనం, స్కాలర్‌షిప్, ట్రాన్స్‌పోర్టు, స్టైఫండ్ అలవెన్స్‌లను అందజేస్తున్నారు. దివాంగ విద్యార్థుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోతవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధాన చేశారు. కార్యక్రమంలో అంజుమారుక్సానా, జాకీర్ హుస్సేన్, వీరేష్, జాకీర్‌బాషా, శైలజ, హరీఫా, గోపాల్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మార్చి లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

● పీడీ చిరంజీవి



గోనెగండ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ చిరంజీవి

గోనెగండ్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం ద్వార గృహాలను పొందిన లబ్ధిదారులు ఈ ఏడాది మార్చిలోపు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ చిరంజీవి కోరారు. గోనెగండ్లలోని కేజీబీవీ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న గృహాలను బుధవారం పీడీ చిరంజీవి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో మణిమంజరి, హౌసింగ్ డీఈ ప్రసాద్ పరిశీలించారు. ఏఈ షేక్షావలిని అడిగి సమాచారం తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలో మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ మండలానికి ఎంఎవై 1.0 కింద 658 గృహాలకు గానూ 482 బేసిమెంట్ లెవల్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 1.85 లక్షలతో పాటు అదనంగా రూ.50 వేలు అందజేస్తుందని తెలిపారు. పూర్తి అయిన గృహాలకు విద్యుత్ సౌకర్యం కూడా వెంటనే ఇస్తున్నట్లు వారు తెలిపారు. హౌసింగ్ ఏఈ షేక్షావలి, గ్రామ సర్పంచ్ హైమావతి, ఏపీఎం మహమ్మద్ బాషా, పలుగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే చర్యలు



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు పనివేళలు పాటించాలని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం సచివాలయం ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. సమయానికి రాని ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో ఆర్డీయూ యూనిట్స్ ద్వారా ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు సులభతరంగా బోధిస్తున్నారా? అని ఉపాధ్యాయులను అడిగారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్, పంచాయతీ కార్యదర్శి రవి, సిబ్బంది పాల్గొన్నారు.

లెదర్ సొసైటీ ఆస్తులను కాపాడాలి



రిలే దీక్షలో పాల్గొన్న లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెదర్ సొసైటీ ఆస్తులు అన్యక్రాంతం కాకుండా కాపాడాలని లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లు షేర్ హోల్డర్లు కోరారు. బుధవారం సోమప్ప సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షకు జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు, నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ లెదర్ సొసైటీ షేర్ హోల్డర్లకు న్యాయం చేయాలని, చనిపోయిన షేర్ హోల్డర్ల షేర్లను వారి కుటుంబ సభ్యులకే తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. సొసైటీలో అసలైన షేర్ హోల్డర్లను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో షేర్ హోల్డర్లు దేవదానం, శాంతి రాజు, దావీదు, ఉసేని, రవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాల పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నందవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం ఆరు మినీ గోకులాలకు ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరన్నగౌడు మాట్లాడుతూ రైతులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మిని గోకుల షెడ్లను మంజూరు చేసిందన్నారు. ఇది రైతు ప్రభుత్వమని, ప్రతి రైతుకు చంద్రబాబు తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్, ఏపీవో శ్రీనివాసులు, ఈసీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రవి, టీఏలు మధుమతి, ఆలీ, ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి, కొండయ్య, తాయన్న పాల్గొన్నారు.

సొంత గ్రామాలకు చేరుతున్న వలస కూలీలు



స్వగ్రామాలకు వస్తున్న కూలీలు

కోసిగి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం నుంచి గత మూడు నెలల క్రింద వలస వెళ్లిన కూలీలు అక్కడ పనులు ముగియడం, తగ్గడంతో చలి తీవ్రత అధికంగా ఉండటంతో కొందరు వలస కూలీలు సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. రెండు రోజులుగా వివిధ గ్రామాలకు చెందిన వలస కూలీలు వలసబాట వీడి పిల్లాపాపలతో వాహనాల్లో సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. గతంలో గ్రామంలో కూలీలతో పాటు రైతులు కూలీలు అధిక సంఖ్యలో వలస బాట పట్టడంతో గ్రామాలన్నీ నిర్మానుష్యమయ్యాయి. అయితే ఇప్పుడిప్పుడే సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. వీరికి స్థానికంగా పనులు కల్పించాలని కూలీలు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.